# ఎందుకొచ్చిన 'బఫే'లు?

'వివాహ భోజనంబు
వింతైన వంటకంబు
వియ్యాలవారి విందు
అహ్హాహ్హ నాకె ముందు...!' యిలాటి భోజనం పాట ప్రపంచంలో మరెవరికీ వుందనుకోను. అయితే అందులో వల్లించిన వంటకాలన్నీ యిప్పటికీ అంతా వండుతున్నారనుకుంటా. మన ఆడవాళ్ళ పాటల్లో చాలా భోజనపు పాటలున్నాయ్ - అవన్నీ వేళా కోళం పాటలే! 'వియ్యాలవారింట విందు చేసినారూ' అనే పల్లవితో అవి ఉడకలేదు, యివి బావులేదు అని వరస పెట్టి దెప్పుతూ వుంటారు. ఆడ పెళ్ళివారిని మగ పెళ్ళివారు దెప్పితే, మగపెళ్ళివారికి ఆడ పెళ్ళివారు జవాబిస్తూ - పెళ్ళి కొడుకుని వెక్కిరిస్తారు కవ్వింపుగా ఇప్పుడిటువంటి సరదాలేం లేవు.

మన కల్చర్లో మనుగుడుపులు ఏడిశాయి కాని, .... ఏడవలేదు. మనుగుడుపులు మూలపడ్డాక యీ రెసెప్షన్లోటి పులిమీద పుట్రలా తయారయ్యాయి. పూర్వంరాజులో, జమిందారులో వాడే నగిషీ చెక్కు సింహాసనాల్లాటి కుర్చీల్ను రెంటిని అద్దెకు తెప్పించి హాల్లోకి ఎంట్రెన్సులో వేస్తారు. పిల్లా, పిల్లాడూ, చిలకాగోరింకల్లా ధగధగాయమానంగా ముస్తాబై నిల్చుంటారు. పెళ్ళికి రానివాళ్ళూ, కారణాంతరాల వలన సాయంకాలం మాత్రమే 'ఫ్రీ'గా వుండేవాళ్ళు సకుటుంబ సపరివార సమేతంగా వచ్చి వధూ వరుల్ని ఆశీర్వదించే నెపంమీద కుర్రాడికి షేక్ హాండ్లిచ్చి, కుర్రదానికి రెండక్షింతలు నెత్తిమీద వేసి (అక్షింతలు ఫ్యాషన్ కాకపోతే మానేసి) ఓ ప్యాకెట్టు ప్రజంటేషన్గా ఇచ్చి, వెర్రి నవ్వు నవ్వుతూ వాళ్ళతో ఫోటో దిగి అక్కడే తుమ్మచెట్టులా నిలబడిపోకుండా నెక్స్ట్ వారికి తప్పుకుని జాగా యివ్వాలి. ఈ అతిథులు వచ్చినప్పుడల్లా నుంచోలేక కూర్చోలేక ఆ పిల్లా పిల్లాడు మొహవంతా జిడ్డుకారిపోగా 'యీ పెళ్ళెందుకు చేసుకున్నాంరా శ్రీమన్నారాయణమూర్తీ' అని పైకి అనక పోయినా లోపల చితగ్గొట్టినట్లయిపోయి - కొత్త పేక ముక్కల్లా పరపరలాడుతూ వుండవలసిన వధూ వరులు నలిగిపోయిన నవలలాగ (డాగ్ఎడ్జిడ్ బుల్)మణిగిపోయిన పేకదస్తాలాగా, జేబులో దాక్కుని మడత పడ్డ ఖరీదైన సిగరెట్ ప్యాకెట్లాగ, మెరుగు తగ్గిన సువర్ణ కంకణాల్లాగ తెల్లబోయి డీలా అయిపోతారు. ఈ లోపుగా పెళ్ళికొడుకు స్నేహితులు, పెళ్ళి కూతురి క్లాస్మేట్స్ వచ్చి నవ్వించినప్పుడు నవ్వాలి. దవడలు నొప్పులెట్టినా - లక్ష్మీనారాయణ, పార్వతీ పరమేశ్వరులు, రతీ మన్మధుల్లా వుండకపోయినా - అన్ రిజర్వుడు కంపార్ట్మెంట్లో ఎక్కిన లైలా మజ్నూల్లా కొంత సేపటికి కళతప్పి నీరసపడిపోతారు. వాళ్ళకి గ్లూకోజ్, బోర్నవిటా, ఎలక్ట్రోజు యిలాటివి యిచ్చి నిలబెట్టడానికి ఫ్రండ్స్ ప్రయత్నిస్తూ వుంటారు. ఈ రిసెప్షన్లలోనే బహుమతిలిచ్చేసి

చేతులు కలిపేసి, ఫోటోలు దిగినాక వచ్చిన వారికోసం డాన్స్ ప్రోగ్రామో, సంగీత కచ్చేరీయో, మిమిక్రీయో ఏదో ఒకటి తగిలిస్తారు. ఆ ఆర్టిస్టు ఎంతబాగా పాడినా, డాన్సు చేసినా, నవ్వించినా వచ్చినవాళ్ళు ఎవరి గొడవలో వాళ్ళు వుంటారు. ఈ వినోద కార్యక్రమం ఓ పక్కన సాగుతుండగానే మరోపక్కన బఫె డిన్నర్ అరేంజి చేస్తారు. (బుఫె అంటారో బఫె అంటారో తెలియదుకాని – యిది ఫ్రెంచి మాట కాబోలు) అల్పాహారాలకి, కబుర్లాడుకోడానికి, పరాయి స్త్రీలను చూసీ మెచ్చుకోడానికి, సరదాలకు, సరసాలకు పలకరింపులకు 'బఫె' డిన్నర్లు శ్రేష్ఠం అంటారు.

ఈ మధ్యన ఏ పెళ్ళికి ఎక్కడకు వెళ్ళండి యీ బఫెడిన్నర్లు, బఫె లంచిలు, బఫె విందులు సిద్ధం నమః తయారయాయి. (సిద్ధం నమః జైనుల మాటట. దీనికి మనవాళ్ళు ఓం నమః శివాయ చేర్చి మళ్ళీ సిద్ధం నమః చేశార్ట! అదేమో మాకు తేలీదు గాని బట్టలు నూలుపోగుకూడా వంటిమీద లేకుండా తిరిగే కుర్రకుంకల్ని జైన దేవుడిలా ఏవిట్రా ఆ అవతారం (?) అని వెక్కిరిస్తూ వుంటారు. ఈ జైన దేవుడికి 'జానే దోవ్' అనే నిరసనపు మాటకి ఏమైనా కనక్షన్సు వున్నాయేమో కనుక్కోవాలి.)

ప్రస్తుతానికి వస్తే – యీ 'బఫె' డిన్నర్లు, లంచిలు మనింటికి వచ్చిన ఆడాళ్ళనీ, మగాళ్ళని ఏడిపించడానికి కనిపెట్టారేమోనని నాకో డవుట్. ఎందుకంటే – మనింటికి వచ్చిన వాళ్ళు కడుపు నిండా తినాలంటే 'బఫె'లు పెట్టకూడదు. భోజనం అని విందు భోజనమే కానివ్వండి, నిలబడి చేసే ఘనకార్యం కాదు. ప్లేటు చేత్తో పట్టుకుని మరో చేత్తో వడ్డించినవి తింటూ (ఆ పదార్థాలను, రస ద్రవాలను పక్కవాళ్ళమీదగాని, మనమీద మనమే గాని పోసుకోకుండా – తింటూ నవ్వుతూ మాట్లాడుతూ) తిరగడం బ్రహ్మవిద్యే. అసలు మన వాళ్ళు భోంచేసేటప్పుడు మాట్లాడకండిరా రాస్కెల్సు, నోరు మూసుకు తినండిరా అని గుడ్లెర్రజేసి చెప్పారు. బిజినెస్ డిన్నర్లు అని వుంటాయి. వాటిలో తింటూ, తాగుతూ మాట్లాడుకొంటారు. తిండి వేరు, బిజినెస్సు వేరు. రెండూ కలపకండి వెధవల్లారా అని మా తాతయ్య తిడుతూ వుండేవాడు. అదియునుంగాక రెండు పౌనులో, అర కేజీయో బరువుచేసే పళ్ళేన్ని (పెళ్ళాన్ని కాదు) మోయాలి. అందులో దీనమ్మకడుపుమాడ 'విజిటబుల్ బిర్యాని' వుండనే వుంటుంది. సిగ్గులేకుండా ఉల్లిపాయ పెరుగు పచ్చడితో సహా. మనకూరలున్నా యనుకోండి పప్పుకూరలు, క్యాబేజీ కూరలు, వంకాయ మసాలా కూరలు, బెండకాయ పులుసు కూరలు యివి అయిదు వేళ్ళూ పోనిచ్చి చేత్తో కలుపుకుతింటేనే మజా, కాని స్పూన్ల తోనూ, ఫోర్కులతోనూ తినే వ్యవహారంకాదు గదా! పులుసుగాని, సాంబారుకాని, మజ్జిగ పులుసు కాని 'బఫె'లో మీదపోసుకోకుండా తినడం కష్టం. ఒకటికి పదిసార్లు ప్లేటు పుచ్చుకుని వెళ్తే వడ్డించేవాడు మనవాడు కాదుగదా – వీళ్ళెంత తిండిపోతులని అనుకుంటాడేమోననే శంక, భయం, అనుమానమూనూ. చపాతీలు, పూరీలు లాటివి ఒక కూరతో లాగించేసి పెరుగుతీసుకోవచ్చు. మన ఆంధ్రా మీల్సు 'బఫె' టెక్నిక్కు యిమిడిచావదు, పట్టుచీర కట్టుకుని స్విమ్మింగుపూల్ లోకి దూకినట్లు, పంచె కట్టుకుని యుద్ధానికి

వెళ్ళినట్లు తెలుగువాడు పచ్చళ్ళ భోగి కదా - ఊరగాయల సంగతి సరే సరి. 'బఫె'లో యివి కలుపుకుని తినాలంటే ముందువాడి వీపుమీద మన ప్లేటు పెట్టుకుని తినాల్సిందే. అయితే యిటీవల కర్డ్ రైస్, సాంబార్ రైస్, కిచిడీ రైస్ అని కలిపేసిన పుడ్లు రడీగా పెంచుతున్నారు. గుడ్డిలో మెల్లలాగ యిది కొంత మేలేకాని కలుపుకుని జుర్రుకుని తినే యోగం మాత్రం కాదు. భోజనం కూడా ఒక యోగం - ఇవన్నీ తిన్నాక పాయసం, మధ్యలో స్వీట్లు, చివరన ఐస్క్రీమ్. లేదా కాఫీ - యీ విషయసూచిక అంతా పూర్తి చేసేసరికి చేతులు లావెక్కిపోతాయి, బట్టల మీద పడ్డాయో ఎంత ఖరీదైన పట్టుచీరయినా డాగులుపడికళంకితమవుతుంది.

'బఫె' డిన్నర్లలో మన భోజన మర్యాదలు ఆహుతి అయిపోతాయి. ఇంకాస్త తినండి, మళ్ళీ వేయించుకోండి. అప్పుడే లేస్తారా అని మొహమాటం పెట్టే తంతువుండదు. 'బఫె' డిన్నర్లలో అన్నదాత (కన్యదాత)కి గెస్టుకి మధ్య హోటల్వాడు దూరుతున్నాడు. అతిథికి, యజమానికి మధ్య వుండే సంబంధం పలచనయి పోతుంది. ఈ మాయామేయ జగత్తులో 'బఫె' డిన్నరు కూడా ఒక మాయ - వడ్డించే వాడూ తినేవాడూ కూడా ఒక్కరే. సర్వింగు బల్లల ఖర్చు ఏమీ వుండదు. నిలబడి తినేవాడు వాడి మొహం ఏం తింటాడు విస్తరాకుల్లో పారేసే వేస్ట్ లాటిది వుండదు - యిది ఎకానమీకి ఎకానమీయే కాని తెలుగు భోజనానందానికి కడు దూరం.

మా వారి మిత్రులు ఐ.జె. రావుగారన్నట్లు పెద్ద పెద్ద 'బఫె' పార్టీలకు వెళ్ళివచ్చాక యింటికొచ్చి యింత ఆవకాయ, పెరుగు అన్నం తింటేనేగాని ఆత్మ శాంతించదు, జీవుడి వేదన 'అణగారదు'ట. మీరే మంటారు? హెల్ప్ యువర్ సెల్ఫ్ అంటారా? ఇంకాస్త పప్పుపులుసు మరో రెండు బొబ్బట్లు వెయ్యమని అంటారా? జైహింద్!

# మా వీధి నాటకమ్

ఊరిఖే వీధి చివర్న నిలబడి దిక్కులు చూసే కుర్రాళ్ళని, వాళ్ళ నోట్లో సిగరెట్లని చూస్తే మీకేమనిపిస్తుంది? వూచి పుచ్చుకు దవడ పేలి పోయే లాగా ఓటిచ్చుగోవాలనిపించదూ! పాపము శమించుగాక! ఆ కుర్రాడు మీ తమ్ముడు కావచ్చు, చిన్న మరిది కావచ్చు, మీ కొడుకే కావచ్చు-కాని, గుబ్బగలకొట్టేది సిగరెట్టు కాలుస్తున్నందుకు గాదు, జీవితంలో మళ్ళీ తిరిగిరాని విలువైన కాలాన్ని వేస్ట్ చేస్తున్నందుకు.

కిళ్లీ కొట్ల ముందు నిలబడి గప్పుగా సిప్పు కొట్టడం, వీధిలో సినిమా పోస్టర్ల ముందు నిలబడి పోసుకోలు కబుర్లు చెబుతూ కాలక్షేపం చెయ్యడం, కాఫీ హోటళ్ళలో బల్లల చుట్టూ చేరి గంటల తరబడి చాలు, కబుర్లు, సిగరెట్లతో కాలం గడిపెయ్యడం, సినిమా హోళ్ళ దగ్గర